# బహుమానం

శ్రీమతి టి. కృష్ణవేణిగారు,

"రమా - రమా"

"వోయ్. యేమిటండీ..."

"నీకోమాట చెప్పాలి, త్వరగా రా అని కేకవేశాడు."

రమేష్ పిలుపువినగానే కాఫీకప్పుతో వచ్చింది రమ. "రమా! ఈరోజు మా కాలేజీలో నాటకం వేస్తున్నారు. అందులో నేనుకూడా ఒక పాత్రవెయ్యాలి. నేను వచ్చేటప్పటికి కొంచెం ప్రొద్దుపోతుంది. జాగ్రత్తగా వుండుసుమా. ఇది పల్లెటూరనుకున్నావేమో. హైదరాబాదు పట్నంలో దొంగలు జాస్తిగా వుంటారు. ఎవరైనావచ్చి తలుపుతియ్యమంటే తీసేవ్" "ఓస్ అంతమాత్రం తెలీదుటండీ, యెంత పల్లెటూరిదాన్నయినా. ఇన్నిరోజులనుండి మీరు ఇక్కడ వుంటున్నారు యెప్పుడూ పెన్నులూ మనీపర్సులూ పారేసుకుంటూ వుంటారు కాని_పైగా నన్నే తెలివితక్కువ దానికింద కట్టేశారు" అంది రమ. "సరే నీ యిష్టం నేచెప్పేదేదో చెప్పేశా. నేవెళుతున్నా తలుపేసుకో" అంటూ రమేష్ వెళ్లిపోయ్యాడు.

రమేష్ హైదరాబాదు సిటీకాలేజీలో యమ్.ఎ. చదువుతున్నాడు. 22_సంవత్సరాల యువకుడు. రమేష్ తలిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవటంవల్ల మేనమామ అయిన సుబ్బయ్యగారే పెంచి తన కూతురు రమనుఇచ్చి వివాహంచేశారు. వాళ్లకు కూడా ఒక్కతే కూతురు. భూములమీద బాగా రాబడి వస్తుంది. దానితో పల్లెటూరులో జీవనం చేస్తున్నారు. రమేష్ శెలవల్లో అత్తవారి వూరు వెళ్లినప్పుడు పిల్ల పెద్దదయింది దాన్నికూడా తీసుకెళ్లి అక్కడే కాపరం పెట్టమన్నారు అత్తగారు మామగారు. అతని చదువు పూర్తయి వుద్యోగం దొరికేదాకా సంసారానికయ్యేఖర్చు పంపుతానన్నాడు మామగారు. వాళ్లమాట ప్రకారం హైదరాబాదులో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని భార్యతో కాపరంపెట్టాడు రమేష్. రమేష్ వెళ్లగానే రమ తలుపేసుకుని యేదో నవల చదువుకుంటూ కూర్చుంది. రెండుగంటల తరువాత రమ లోపలవంట చేస్తున్నది. ఇంతలో యెవరో తలుపుతట్టారు "యెవరండీ తలుపుతీయండీ" అన్న బొంగురు గొంతు వినిపించింది. రమ తలుపుతెరవగానే ఒక పొడుగాటి నల్లటిమనిషివచ్చి నుంచున్నాడు. చెవులదాకా వ్రేళ్లాడే గిరజాలజుట్టూ కళ్లకు నీలిరంగు అద్దాల జోడుగలమనిషి. అతను సరాసరి లోపలికివచ్చి కుర్చీలో కూర్చున్నాడు ఇదివరకు పరిచయమున్నవాడికి మల్లే. "యెవరికోసం వచ్చారండీ" అంది రమ. అతను బొంగురు గొంతుతో "రమేష్ ఈ రోజు కాలేజీలో నాటకమని చెప్పివెళ్లాడు కదండీ! టైమయినదన్న తొందరలో సైకిలు లైటు వెలిగించుకోకండా వెళుతుంటే పోలీసులు పట్టుకున్నారు. డబ్బిచ్చి వదలించుకుందామంటే పర్సు ఇంట్లోనే మరచివచ్చాడట. తీరా అదే సమయానికి నేను వెళ్లాను. వాడికీ నాకూ చాలాస్నేహం. నేనన్నా డబ్బిద్దామంటే నాపర్సు యెవరో కొట్టేశారు. అప్పుడు రమేష్ మా ఇంటికెళ్లి - మీతో యీ విషయంచెప్పి ఓ పదిరూపాయలు పట్టుకోరమ్మన్నాడు. మీరు నన్ను నమ్మరేమోనని వాడిపెన్నుకూడా ఇచ్చాడు. చూడండి" అని పెన్ను యిస్తూ అన్నాడు. రమ పెన్ను పరీక్షగా చూచింది. అది రమేష్‌దే. దానిమీద సన్నటి అక్షరాలతో రమేష్ అని వ్రాసికూడావుంది. రమ లోపలికెళ్లి రమేష్ పర్సులోనుండి ఒక పదిరూపాయల కాయితం తెచ్చి అతని కిచ్చింది - అతను వెళ్లిన అరగంటకే రమేష్ వచ్చాడు.

"రమా ఈరోజు నాటకంలో నా పాత్రనుచూచి అందరూ ఆశ్చర్యపోయినారు. ఎవరూ గుర్తించలేదుకూడానన్ను - మాకాలేజీ ప్రిన్సిపాల్ గారు కూడా ఆశ్చర్యపడ్డాడు నా యాక్షన్ చూచి." చొక్కావిప్పి వంకెకి తగిలిస్తూ అన్నాడు రమేష్. నవ్వుతూ - "అబ్బ అన్నీకోతలు" అన్నది, ఆమె

"కాదు రమా! నువ్వుచూస్తే - యెవరో యితను అనుకునేదానివి. అది సరేలేకాని రమా! యీరోజు ఒక తమాషా జరిగింది. నాటకం పూర్తవగానే మేమంతా హాల్లో కూర్చొని టీ త్రాగుతున్నాం. ఇంతలో ఒక నల్లటిగిరజాలతను నా ప్రక్కనేవచ్చి కూర్చున్నాడు. అతను పదేపదే "మీ బుష్‌కోటు బాగుందండీ. ఎక్కడ కొన్నారండీ -" అని అడుగుతూ నా బుష్‌కోటు పట్టుకుని చూడడం మొదలెట్టాడు. కొంచెం సేపయింతరువాత అతనులేచి వెళ్లిపోయినాడు. అతను వెళ్లగానే చూచుకుంటే నా పెన్ను లేదు. ఇదేమిటని జేబులన్నీ వెతుక్కున్నా. ఇంతలో నాస్నేహితులందరూ చెప్పారు. నా ప్రక్కన కూర్చున్న అతను చాలా పెద్దదొంగ. పర్సులూ పెన్నులూ కొట్టేయడంలో అందెవేసిన చెయ్యి. అదే అతని వృత్తి. అతను వచ్చాడంటేనే మాకుభయం అని చెప్పారు. 'నా పెన్ను పోతే పోయిందిలే కాని మనయిల్లుకనుక్కొని నీ దగ్గరకువచ్చి నా పెన్ను చూపి - యేమయినా డబ్బులు పట్టుకెళ్లాడేమోనని భయమేసి త్వరగా ఇంటి కొచ్చేశా. అల్లాంటిదేమీ జరగలేదుకదా'' అన్నాడు. "భలేవారేలెండి; యెవరో పరాయివాళ్ళొచ్చి డబ్బడుగుతే ఇస్తాననుటండీ ఎంత మీ పెన్నుచూపినా నేనేం తెలివితక్కువ దాన్ననుకున్నారా" అంది రమా! ... "ఓ-చాలా తెలివిగల దానివేలే కాని, నీ ముఖవైఖరి చూస్తే యేదో జరిగినట్లుగానే యుంది. నిజంచెప్పు రమా! వెధవడబ్బు పోతేపోయింది"

"నేనెవరికి డబ్బివ్వలేదంటే నమ్మరేం" అంది రమ. "వాడువచ్చి డబ్బు తీసుకెళ్లాడని, రుజువు పరుస్తేనో" అన్నాడు రమేష్.

"రుజువు పర్చండి; తరువాత ఆలోచిద్దాం" అంది రమ నిర్లక్ష్యంగా.

"అయితే వినురమా ఇందాక వచ్చిన గిరజాలతణ్ణి నేనే. నేను చాలా తెలివిగలదాన్నని, యెప్పుడూ కోతలు కోస్తుంటావ్. ఏదో ఆ తెలివి చూద్దామనివచ్చా. అదికాక నాటకంలో నేనువేసిన వేషంకూడా అదే. నేను కనుక సరిపోయింది. ఇంకెవరైనా పరాయివాళ్ళయినా ఇంతేకదా. పైగా అడిగినా కూడా నిజం చెప్పవు."

"అదే కాదుటండీ నేననడం పరాయివాళ్ల కెవరికీ డబ్బివ్వలేదని, అసలు మీరు రాగానే నేను గుర్తించా. మీరు సరాసరి పరిచయంగల మనిషల్లే లోపలికొచ్చి కూర్చోవడం, బొంగురు గొంతుగామార్చి మాట్లాడటానికి మీరుపడ్డ అవస్థ - మీ సైకిలు పోలీసులు పట్టుకుంటే, సైకిలు అక్కడేవుంచి, ఇంటికొచ్చి డబ్బు పట్టుకెళ్ళవచ్చుకదా అతన్నెందుకు పంపేవారు - తరువాత మీరు మొహానికి వేసుకున్న రంగు కొంచెం కొంచెం చెమటచే చెరిగిపోయింది - అంతా నేను చూస్తూనే యున్నాను. మీమగాళ్ళు యెంత వేషం మార్చుకున్నా, మేంవెంటనే గుర్తుబట్టగలం" అన్నది. రమేష్‌కు రమచెప్పిన మాటల్లో యేమీ నమ్మకం కలగలేదు. ఇదంతా కల్పితకథ అనుకున్నాడు.

హేళనగా రమేష్ "రమాదేవిగారూ! మీ తెలివితేటలకి సంతసించాంకాని యేదయినా నిదర్శనం చూపండి చూద్దాం" అన్నాడు.

రమకూడా హేళనగా అంది. "ఓహో రమేష్ బాబుగారూ! మీ తెలివిని కొంచెం బయటపెట్టి ఆ నోటును పరీక్షించి చూడండి మీకే తెలుస్తుంది యెవరి తెలివి గొప్పదో. మీ వేషానికి ఆ పదిరూపాయలూ బహుమానంగా ఇచ్చా తెలుసా," అంది రమాదేవి. రమేష్ జేబులోనుండి నోటుతీసి పరీక్షగా చూచాడు. దాని చివరన చాలా సన్నటి అక్షరాలతో బహుమానం అని వ్రాసివుంది. అదిచూచి ఆశ్చర్యపోయినాడు రమేష్. రమ అతనివేపు గర్వంగా చూచింది.